15-05-2025
గురువారం
మల్కాజిగిరి
jayabherinews
JAYABHERIDAILY.COM
ప్రభాత
జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 229 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

# అరుణాచల్ ఎప్పటికీ మాదే..

- చైనాకు భారత్ కౌంటర్..
- కేబినెట్, CCS సమావేశాల్లో కీలక నిర్ణయాలు..



**జయభేరి, న్యూ ఢిల్లీ :**

ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన భద్రతా వ్యవహారాల కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా భారత్‌పై విషం చిమ్మిన పాక్ మిత్ర దేశాలపై చర్యలు ప్రకటించారు. పాకిస్తాన్‌కు డ్రోన్ల సాయం చేసిన టర్కీపై కూడా చర్యలు తీసుకున్నారు. టర్కీ న్యూస్ ఛానెల్ TRT వరల్డ్ ట్విట్టర్ ఖాతాపై బ్యాన్ విధించింది కేంద్రం .. కేబినెట్, CCS సమావేశాల్లో పలు అంశాలపై చర్చ జరిగింది. ఆపరేషన్ సింధూర్, కాల్పుల విరమణ తర్వాత పరిణామాలపై చర్చించారు. సెమీ కండక్టర్ ఇండస్ట్రీకి ప్రోత్సాహం ఇవ్వాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

...మిగతాది 2 లో

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్



**జయభేరి, న్యూ ఢిల్లీ :**

రాష్ట్రపతి భవన్ లో బుధవారం సుప్రీం కోర్టు 52వ ప్రధాన న్యాయ మూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ప్రమాణం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మ జస్టిస్ గవాయ్‌తో ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్ర మానికి ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, గవర్నర్లు తదితరులు హాజరయ్యారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన రెండో దళిత వ్యక్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ రికార్డులకెక్కారు. జస్టిస్ గవాయ్ 1960 నవంబర్ 24వ తేదీన మహారాష్ట్రలోని అమరా వతిలో జన్మించారు. 1985 లో లా ప్రాక్టీస్ ప్రారంభించిన తర్వాత, భోసలే వంటి సీనియర్ న్యాయవాదుల తో కలిసి పనిచేశారు. అనతికాలంలోనే స్వతంత్రంగా ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు. ఆయన మునిసిపల్ కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు కార్పొరేషన్లకు స్టాండింగ్ కౌన్సిల్‌గా కూడా పనిచేశారు.

# అప్రమత్తంగా ఉండండి.. అధిక సేవలు అందించండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



**జయభేరి, జయశంకర్:**

సరస్వతి పుష్కర విధులు కేటాయయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ 12 రోజులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాలేశ్వరం దేవస్థానంలోని కళ్యాణ మండపంలో విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులు,

...మిగతాది 2 లో



2 లో

**తెలంగాణలో తరతరాలుగా వాయిదాలు పడుతున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న చిత్తశుద్ధితో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ నీటి పారుదల శాఖలో కొత్తగా నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులను ఉద్దేశించి చెప్పారు. తెలంగాణ రైతులు ఆత్మగౌరవంతో బతకడానికి అవసరమైన నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో భాగస్వాములై ప్రజల భావోద్వేగానికి ప్రతీకలుగా నిలబడాలని సూచించారు.**

# తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలి

**జయభేరి, హైదరాబాద్ :**

కొలువుల పండుగలో భాగంగా నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 244 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, (AEE), 199 జూనియర్ టెక్నికల్ ఆఫీసర్స్ (JTO) లకు జలసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములవుతున్న ఉద్యోగులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. "గత నలభై యాభై ఏళ్లుగా రావలసిన నీళ్లు రాకపోగా, పూర్తి కావలసిన ప్రాజెక్టులు పూర్తి కాని కారణంగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, వాయిదా పడుతున్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. నీళ్లు ఎంత అవసరమో అందుకు ఎంతగా పరితపించామో, ఏ నీటి కోసమైతే పోరాటం మొదలైందో ఆ నీళ్లే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టాయి. అందుకే నీటి పారుదల శాఖకు ప్రభుత్వం అంత ప్రాధాన్యత ఇస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో నాలుగైదు దశాబ్దాలు వాయిదా పడిన ప్రాజెక్టులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లలో కూడా పూర్తి కాలేదు. జలయజ్ఞంలో భాగంగా ప్రారంభమైన ప్రాజెక్టులు తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లలో ఏదీ పూర్తి కాలేదు.

# పెన్షన్లు, తల్లికి వందనం పథకంపై బిగ్ అప్డేట్



2 లో

- సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

**జయభేరి, విజయవాడ, మే 14;**

టీడీపీ కేంద్ర కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సమావేశం జరిగింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి కీలక నేతలంతా హాజరయ్యారు. ముందుగా ఆపరేషన్ సింధూర్‌కు మద్దతు తెలుపుతూ మోదీకి అభినందనలు తెలిపారు. ఉగ్రదాడిలో చనిపోయిన వారికి, ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన సైనికులకు సంతాపం తెలిపారు.16,17,18 తేదీల్లో నియోజకవర్గాల్లో తిరంగా ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించాల్సిన మహానాడుపై ప్రధానంగా చర్చించారు. తొలి రెండు రోజులు 23 వేల మందికి ఆహ్వానించాలని నిర్ణయించారు. చివరిరోజు గ్రామ అధ్యక్షుల వరకు 50వేల మందికి ఆహ్వానం పలకనున్నారు. కనీవిని ఎరుగని రీతిలో మహానాడు నిర్వహిస్తున్నట్లు పొలిట్‌బ్యూరో సభ్యులు వెల్లడించారు.

జూన్ 12 నుంచి కొత్తగా లక్ష వితంతు పెన్షన్లు అందించాలని సమావేశంలో నిర్ణయించారు. మూడు గ్యాస్ సిలిండర్లకు ముందే డబ్బు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అలాగే జూన్ 12న స్కూళ్లు తెరిచేలోపు తల్లికి వందనం అందేలా చూడాలన్నారు.



2 లో

# తారకరాముడికే గులాబీ పగ్గాలు

**జయభేరి, హైదరాబాద్, మే 14:**


తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలలో భారత రాష్ట్ర సమితి ఒకటి. ఇది రెండు పర్యాయాలు తెలంగాణలో అధికారాన్ని చలాయించింది. ముఖ్యమంత్రిగా కేసీఆర్ రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించారు.. తెలంగాణ ముఖ్యమంత్రిగా మాత్రమే కాదు.. భారత రాష్ట్ర సమితి కి అధ్యక్షుడిగా కేసీఆర్ కొనసాగారు. అధికారం పోయిన తర్వాత కూడా ఆయన అదే స్థానంలోనే ఉన్నారు. ఇక ఆయన కుమారుడు కేటీఆర్ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. పేరుకు కార్యనిర్వాహక అధ్యక్షుడైనా సరే.. ఇప్పటికీ పార్టీలో పెత్తనం మొత్తం కేటీఆర్ దే. కొన్ని విషయాలు మినహా.. అన్నింటిలోనూ కేటీఆర్ దే పెత్తనం సాగుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఇటీవల కాలంలో భారత రాష్ట్ర సమితి పగ్గాలు కేటీఆర్ కు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. దీనిపై భారత రాష్ట్ర సమితి కీలక నాయకుడు కూడా ఎస్ అనే సమాధానమే చెబుతున్నారు. అయితే కెసిఆర్ కేటీఆర్ ను ఎప్పుడు పార్టీ ప్రెసిడెంట్ చేస్తారు? అనే ప్రశ్నకు మాత్రం ఇంతవరకు సమాధానం లభించడం లేదు.కేటీఆర్ ఒకవేళ పార్టీ ప్రెసిడెంట్ అయితే.. హరీష్ రావు పరిస్థితి ఏమిటి అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. అయితే దీనిపై స్వయంగా హరీష్‌రావే క్లారిటీ ఇచ్చారు. భారత రాష్ట్ర సమితిలో కేటీఆర్ కంటే సీనియర్ నాయకుడు హరీష్‌రావు. కేటీఆర్ కంటే కూడా మొదటి నుంచి ఆయన ఉద్యమంలో ఉన్నారు.

# పాకిస్తాన్ కు గుణపాఠం వచ్చిందా..!?

...మిగతాది 2 లో

# దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహానుభావుడు

**జయభేరి, ఘట్కేసర్ :**



ఘట్కేసర్ మున్సిపాలిటీలో గత ఐదు రోజుల క్రితం ఘట్కేసర్ ముద్దుబిడ్డ వీర జవాన్ ములుగు జిల్లా కర్రెగుట్టలో చత్తీస్గడ్ సరిహద్దు ప్రాంతంలో నక్సలైట్లు పెట్టిన మందు పాత్ర పేలి మరణించిన తిక్క సందీప్ కుటుంబానికి పరామర్శించడానికి ఘట్కేసర్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డితో కలిసి వారి ఇంటికి వెళ్లి వారియోగ క్షేమాలు తెలుసుకొని వారికి ధైర్యం చెప్పి తన వంతు సహాయంగా సొంతంగా రూపాయలు 3.00.000 మూడు లక్షలు తిక్క సందీప్ తల్లి, సతీమణికి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి అందజేయడం జరిగింది. మల్లారెడ్డి మాట్లాడుతూ.. తిక్క సందీప్ మరణించడం చాలా బాధగా ఉందని.. ఉద్యోగరీత్యా తన బాధ్యత నిర్వర్తించి దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహానుభావుడు తిక్క సందీప్ అని.. అతని లేని లోటు ఆ కుటుంబనికి ఎవరు పూడ్చలేనిది అని.. ఆయన కుటుంబానికి ఎల్లవేళలా నా సహకారం ఉంటుందని. వారికి ఈ ఆపద వచ్చిన సహాయం చేయడానికి ముందు ఉంటానని.. బిఆర్ఎస్ పార్టీ కూడా అతని కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ప్రకటించినటువంటి ఎక్స్గ్రేషియను త్వరలో వచ్చేటట్టు చూసే బాధ్యత తీసుకుంటానని.. ప్రభుత్వ పెద్దలో మాట్లాడి మా కుటుంబానికి అండగా ఉంటామని ఆయన ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ సహకార బ్యాంకు డైరెక్టర్ చందుపట్ల ధర్మా రెడ్డి, మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్ రావు, మాజీ కౌన్సిలర్లు. చందుపట్ల వెంకట రెడ్డి, బండారి అంజనేయులు గౌడ్, షేక్ జహంగీర్, కొమ్మిడి అనురాధ రాఘవరెడ్డి, బేతాళ నర్సింగరావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎర్రోళ్ల సత్యనారాయణ, అబ్దుల్ అజీజ్ అనుభయ్, పల్లె విజయ్ గౌడ్, రాధాకృష్ణ రెడ్డి, బిజిలి సదానందం, ఎం ఏ ఖలీల్, రోడ్డ యాదగిరి, సద్దాం, ఎండి నజీర్, అబ్బ గోని నాగరాజు గౌడ్, భోగ అర్జున్, డాక్టర్ ములుగురం జంగయ్య, బబ్బురి శ్రీనివాస్ గౌడ్, మందాడి శ్రీనివాస్ రెడ్డి, పోచయ్య ముదిరాజ్, శ్రీరాములు గౌడ్, లక్ష్మయ్య, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఎండి సిరాజ్, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన మేడిపల్లి పోలీసులు

**జయభేరి, మేడిపల్లి :**

ప్రజల భద్రతను సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, ఇన్స్పెక్టర్ మేడిపల్లి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది. మేడిపల్లి మెయిన్ రోడ్డులో ఆర్టీసీ, ఆటోలలో ప్రయాణిస్తున్న ప్రయాణికులను, వారి లగేజ్, వస్తువులను బ్యాగులను చెక్ చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మేడిపల్లి ప్రజలకు సూచనలు చేస్తూ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినట్లయితే అనుమానాస్పద వస్తువులు ఉన్నట్లయితే, వేరువేరు రాష్ట్రాలకు సంబంధించిన వ్యక్తులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే పోలీసు వారిని డయల్ 100 ను సంప్రదించగలరని మనవి.




పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని బుద్ధ నగర్, రోడ్ నెంబర్ 1లో నూతనంగా ప్రారంభమైన బాలాజీ స్వీట్ హౌస్ ను మాజీ మేయర్ అమర్ సింగ్ హాజరై ప్రారంభించారు. ఈ శుభ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ నాణ్యమైన, రుచికరమైన స్వీట్లు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. బాలాజీ స్వీట్ హౌస్ యాజమాన్యం తమ వినూత్నమైన వంటకాలతో, పరిశుభ్రమైన వాతావరణంలో సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బొందుగుల కృష్ణ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బచ్చ రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యాసారం మహేష్, సత్యనారాయణ, వంగూరి పరమేష్, గడ్డం రాంరెడ్డి, తావిటి ప్రశాంత్ తదితరులు పాల్గొని, స్వీట్ హౌస్ యజమానులను అభినందించారు.

**జయభేరి, మేడిపల్లి**



## ఫడ్నవిస్ ను కలిసిన రోహిత్

**జయభేరి, ముంబై, మే 14:**

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కలిశాడు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత రోహిత్ ఇలా మహారాష్ట్ర సీఎంను కలవడంపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కొంపదీసి హిట్ మ్యాన్ బీజేపీలో చేరి పొలిటికల్ ఎంట్రీ ఇవ్వడం లేదు కదా అంటూ నెటిజన్లు పోస్టులు చేస్తున్నారు. ముంబైలోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను రోహిత్ శర్మ బుధవారం కలుసుకున్నాడు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, రోహిత్ శర్మ కాసేపు భేటీ అయ్యారు. దీనికి సంబంధించిన ఫొటోలను సీఎం ఫడ్నవీస్ నేరుగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దాంతో పాటు రోహిత్ శర్మ నూతన అధ్యాయంలో విజయం సాధించాలని కోరుకుంటున్నా అంటూ పేర్కొన్నారు "నా అధికారిక నివాసమైన వర్షలో రోహిత్ శర్మను కలుసుకోవడం, మాట్లాడటం చాలా సంతోషాన్ని ఇచ్చింది. టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ పలికిన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపాను. తన నూతన అధ్యాయంలో సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను" అని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.రిటైర్మెంట్ తర్వాత రోహిత్ శర్మ ఇలా మహారాష్ట్ర సీఎంను కలవడం పలు ఊహాగానాలకు దారి తీస్తోంది. కెరీర్‌కు గుడ్ బై చెప్పిన తర్వాత ఎంతోమంది క్రికెటర్లు రాజకీయాల్లో చేరారు. ప్రస్తుత టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా బీజేపీలో చేరి ఎంపీగా గెలిచాడు. ఆ బాటలోనే ఇప్పుడు రోహిత్ శర్మ వెళ్తున్నాడని అనుకుంటున్నారు. కానీ రోహిత్ శర్మ టీ20, టెస్టులకు మాత్రమే రిటైర్మెంట్ ఇవ్వగా.. వన్డే క్రికెట్‌లో ఇంకా కొనసాగుతున్నాడు.2013లో టెస్టు క్రికెట్‌లో అడుగుపెట్టిన రోహిత్ శర్మ 2025 వరకూ కొనసాగాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు కొద్ది రోజుల ముందే తన రిటైర్మెంట్‌ను ప్రకటించాడు. ఓవరాల్‌గా టీమిండియా తరఫున 67 టెస్టు మ్యాచ్‌లు ఆడిన హిట్ మ్యాన్ 4301 పరుగులు చేశాడు. 40.57 యావరేజ్‌తో 12 సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు.

## మహానాడు ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష

- పాల్గొన్న మంత్రి లోకేష్

**జయభేరి, మంగళగిరి:**

మహానాడు ఏర్పాట్లపై పొలిట్ బ్యూరో సమావేశానికి ముందు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో మహానాడు కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లతో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమావేశం నిర్వహించారు. మహానాడు ఏర్పాట్ల గురించి నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలవురు మంత్రులు, సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, ఎస్.సవిత, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామితో పాటు సీనియర్ నేతలు బీద రవిచంద్ర యాదవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దామచర్ల సత్య, రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, వీరంకి వెంకట గురుమూర్తి, మంతెన రామరాజు, సి.భూపేష్ రెడ్డి, ఎమ్మెల్యేల జ్యోతుల నెహ్రూ, ఆర్.మాధవి రెడ్డి, జీవీ ఆంజనేయులు, మంతెన సత్యనారాయణ రాజు, చింతకాయల విజయ్ పాల్గొన్నారు.

# హైకోర్టు చెప్పిన జుజుబి అంటున్న ఏసిపి సత్యభామ

- అక్రమార్కులపై చర్యలు చేపట్టేది లేదంటూ శపథం
- అసలు సరూర్ నగర్ టౌన్ ప్లానింగ్ లో ఏం జరుగుతుంది
- నిత్యం అవినీతి అక్రమాలతో విరాజిల్లుతున్న పట్టణ ప్రణాళిక విభాగం

**జయభేరి, సరూర్ నగర్ :**




ఎవరెన్ని చెప్పిన సాక్షాత్తు రాష్ట్ర హైకోర్టు చెప్పిన వినేదే లేదంటూ శపథం పెట్టుకున్నారంట సరూర్నగర్ టౌన్ ప్లానింగ్ ఏసిపి సత్యభామ. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన పట్టించుకునే సమయం తనకు లేదని అక్రమార్కులు ఏం చేసినా తమకు అనవసరమని అక్రమార్కులకి తాను వంత పాడుతానని బహిరంగంగానే తన నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు సదరు ఏసిపి. నీతి నిజాయితీ గురించి భారీ భారీ డైలాగులు చెబుతూ ఆచరణలో మాత్రం ఎలాంటి పురోగతి లేని వ్యవహారం ప్రస్తుతం సరూర్నగర్ టౌన్ ప్లానింగ్ విభాగంలో నిత్య కృత్యమైపోయింది. ఉదాహరణకు వాసవి కాలనీలోని ప్రభుత్వ ఉద్యోగి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం పై ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వీరి అవినీతికి తార్కాణంగా నిలుస్తోంది. తాను సమయం ప్రకారం మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు మాత్రమే కలుస్తానని చెబుతూ ఆ సమయంలో కూడా అందుబాటులో ఉండకుండా ఒకవేళ అందుబాటులో ఉన్న ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా పైపై మాటలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు ఏసీపి సత్యభామ. అసలు టౌన్ ప్లానింగ్ అనే పదానికి కేవలం లంచాల కోసం అన్న చందంగా మార్చేశారు ఈ అధికారులు. ఇక్కడ టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ సురేష్ ఎప్పుడు కూడా అందుబాటులో ఉండకపోవడం మరొక విశేషం. రకరకాల సాకులు చెబుతూ అక్రమార్కులకు వంత పడటం వీరికి దినచర్యగా మారింది. ప్రభుత్వానికి ప్రజలకు కోట్లాది రూపాయల నష్టం కలిగిస్తూ తాము మాత్రం నిత్యం లంచాలమత్తులో ఉండటం శోచనీయం. ఫిర్యాదుల పై చర్యలు తీసుకోమని హైకోర్టు స్పష్టంగా చెప్పిన వీరి చెవికి ఎక్కడం లేదు. సాక్షాత్తు న్యాయస్థానం అక్రమ నిర్మాణాలను సీజ్ చేయడం లేదా కూల్చివేయమని ఆజ్ఞాపించిన వీరు వినే పరిస్థితి లేదంటే లంచాల మత్తులో ఏ స్థాయిలో మునిగిపోయారో అర్థం చేసుకోవచ్చు అంటున్నారు స్థానిక ప్రజలు. ప్రజలకు మంచి చేయాల్సిన అధికారులు ప్రజల పాలిట యమభక్షకులుగా మారి నిత్యం వారికి నరకాన్ని చూపిస్తున్నారు. డిప్యూటీ కమిషనర్ సుజాత వీరిపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు అంటూ ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. న్యాయస్థానాలను సైతం ధిక్కరిస్తూ తామే న్యాయ నిర్ణేతలమంటూ అడ్డగోలుగా రెచ్చిపోతున్నారు ఏసిపి సత్యభామ మరియు వారి సిబ్బంది. ఇప్పటికైనా లంచాలు మానుకొని అక్రమార్కులపై చర్యలు చేపట్టి కొంతైనా తీసుకుంటున్న జీతానికి న్యాయం చేయాలని మేధావులు కోరుతున్నారు. ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటూ ఆ ప్రజలకే చేటు చేయడం ఈ అధికారులకు అలవాటుగా మారిపోయింది. ఇప్పటికైనా హైకోర్టు చెప్పిన ప్రకారం నడుచుకొని అక్రమార్కులపై ఉక్కు పాదం మోపాలని ప్రజలు కోరుకుంటున్నారు.





## సితార ఫ్యామిలీ రెస్టారెంట్ ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే

**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీతార ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని హోటల్ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... యువత స్వయం శక్తితో ఎదగాలని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని రెస్టారెంట్ యజమాన్యం సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు యాసాని రాజవర్ధన్ రెడ్డి, రమావత్ తులసిరామ్, రావుల వెంకటయ్య, పెద్దిశెట్టి సత్యం,రమావత్ దీప్ల,పిల్లి పరమేష్, ఏటేల్లి రాంబాబు, నిర్వాహకులు నాగరాజు, సురేష్,తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాలు ధర్మ ప్రబోధం చేస్తాయి

- ఎల్లికట్ట హనుమాన్ దేవాలయ ప్రారంభోత్సవంలో పూజలు నిర్వహించిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, మే 13 :**

గ్రామాల్లో దేవాలయాలు ఆధ్యాత్మిక ప్రబోధాన్ని చేస్తాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి, సీత రాములు, విగ్నేశ్వర స్వామి, కాశీ విశ్వేశ్వర నవగ్రహ ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి హాజరైన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు ఎల్లికట్టలో అద్భుతమైన దేవాలయం నిర్మిచారని ఆలయకమిటీ పెద్దలను గ్రామస్థులను ఆయన అభినందించారు. దేవాలయం ఆధారముగా ప్రతి వ్యక్తిలో ఆధ్యాత్మికతను, ధర్మ అనుసారముగా జీవనం కొనసాగించటానికి కావలసిన స్ఫూర్తిని నిరంతరం కొన సాగించాలని అన్నారు. శివతత్వం అలవర్చుకుని,సీతా శ్రీరామ చంద్ర ప్రభు సుగుణాలను గుర్తుకు చేసుకుంటూ అభయ ఆంజనేయ స్వామి కార్యదీక్షతను గుర్తుకు చేసుకుంటూ ధర్మం కోసం జీవించాలి అని అన్నారు. దేవాలయ కమిటీ పెద్దలు కాషాయ కండువాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమములో బీజేపీ నాయకులు వంశీ కృష్ణ కుర్మయ్య ,ప్రశాంత్, ఎంకోనోళ్ళ వెంకటేష్ ,నరేష్ ,నరసింహ ,మదన్ మరియు గ్రామా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# MPDO మండల అధికారికి వినతిపత్రం అందజేత

**జయభేరి, దేవరకొండ :**




భారతీయ జనతా పార్టీ దేవరకొండ మండల్ అధ్యక్షులు నేనావత్ రాము నాయక్ ఆధ్వర్యంలో MPDO మండల అధికారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి సురేష్ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకురి నరసింహ మాట్లాడుతు.. మండలంలోని గ్రామ పంచాయతీలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నిరుపేదలకు అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని బహిరంగ సభలలో పత్రిక ప్రకటనలలో, సోషల్ మీడియాలో ఎమ్మెల్యేలు, ఎంపీలు చెప్పడం జరిగింది. కాని గ్రామ పంచాయతీలలో ఇందిరమ్మ ఇండ్లను నిరుపేదలకు కాకుండా అధికార పార్టీ యొక్క కార్యకర్తలకు మరియు లీడర్లకు కేటాయించడం జరిగింది. అక్కడ ఉన్నటువంటి ఇందిరమ్మ ఇండ్లను పంచాయతీరాజ్ సెక్రటరీ, కాంగ్రెస్ లీడర్లు కుమ్మకై అర్హులైన పేదవారికి ఇవ్వకుండా కేవలం అధికార పార్టీ నాయకులకు ఇవ్వడం జరిగింది. కావున తక్షణమే విడు పేదలైన ధరఖాస్తు చేసుకున్న ప్రజలకు వెంటనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తున్నది అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు దాని పక్షంలో భారతీయ జనతా పార్టీ అధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గుండాల అంజన్న, చండేశ్వర్, రెడ్డి శంకర్, ఇడం రవి,బొడ్డుపల్లి అంజి, రవీందర్, సుందర్, రవి, శంకర్, శ్యామ్, లక్ష్మణ్, JP, సిద్దు గణేష్, లక్ష్మణ్, దర్శనం శ్రీను, లచ్చిరామ్, తదితరులు పాల్గొన్నారు.



## వరదరాజ స్వామి దేవాలయానికి విరాళం అందజేతా..

**జయభేరి, మార్కుక్, మే 14 :**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం వరదరాజ పురంలో బుదవారం శ్రీ వరదరాజ స్వామిని దర్శించుకున్న మర్కుక్ మండల బిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ ఆలయ నిర్మాణానికి 10,000 విరాళం అందజేశారు అనంతరం పుష్ప రథోత్సవం లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎఫ్ డీ సీ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి,డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, తాజా మాజీ ఎంపీపీ పాండుగౌడ్, మాజీ జడ్పీటీసీ రామచంద్రం,మాజీ వైస్ ఎంపీపీ మంద బాల రెడ్డి, లక్కాకుల నరేష్, ఆలయ ట్రస్ట్ చైర్మన్ ప్రొద్దుటూరు బాలకృష్ణ,తుమ్మ కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అవసరాల మేరకు రసాయనాలను ఉపయోగించాలి



**జయభేరి, తుర్కపల్లి, మే 14 :**

అవసరాల మేరకే రసాయనాలను ఉపయోగించాలని ఏవో శ్రీ ఉమా అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలం కొండాపురం, గోపాల్ పురం గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు రైతులకు అవగాహన కల్పించడానికి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరాల మేరకే రసాయనాలను వినియోగించాలని, నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని, తక్కువ యూరియా వాడాలని, సాగు ఖర్చును తగ్గించాలని, రసీదులను భద్రపరచాలని, కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందాలని, పంట మార్పిడి పాటించాలని, సుస్థిర ఆదాయాన్ని పొందాలని, చెట్లను పెంచాలని పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ చైతన్య, డాక్టర్ రమ్యశ్రీ, విక్రమ్, స్వప్న, అరుణకుమారి, సౌమ్య, ఏఈవోలు పృథ్వీరాజ్, రాకేష్, దివ్య, జెస్సి, తిరుమల రావు, కావ్య, రైతులు పాల్గొన్నారు.

## కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించాలి




**జయభేరి, తుర్కపల్లి, మే 14 :**

కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించాలని రైతు రాపోలు నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలపై దృష్టిసారించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వం రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు ఇవ్వాలని, తమకు ఎలాంటి నిర్దిష్ట ఆధారం లేదని ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

## రాష్ట్ర గవర్నర్ దత్తత గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు



**జయభేరి, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రగవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత తీసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని పుసుకుంట. గోగులపూడి గ్రామాలు. ఆదిలాబాద్ జిల్లాలోని బురుగు.. మంగ్లీ. మరియు నాగర్ కర్నూల్ జిల్లా లోని అప్పాపూర్. బౌరపూర్. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలియజేశారు. రాష్ట్రంలో గత 10 ఏండ్లుగా నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో తీసుకువచ్చిన భూభారతి చట్టానికి గత నెల 17వ తేదీ నుంచి రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ప్రారంభించి ప్రయోగాత్మకంగా అమలు చేశామని ఎలాంటి రుసుములు లేకుండా ప్రజల నుంచి దరఖాస్తులను. స్వీకరించి సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం పని చేస్తుందని తెలియజేశారు. చిత్రంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ. గృహ నిర్మాణ శాఖ. సమాచార పౌర సంబంధాల శాఖ. స్టాంపు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండి పి వి గౌతమ్. తదితరులు ఉన్నారు..

# ఆరుగాలం కష్టపడి పండించిన పంట
# కొనే దిక్కులేక రైతులు ఇబ్బందులు

- అప్పులు తెచ్చి పంట పండిస్తే కొనే దిక్కులేక కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇబ్బందులు పడుతున్న రైతులు
- గన్ని బ్యాగులు ఇచ్చే పరిస్తితిలో ప్రభుత్వం లేదు.
- లారీల కొరత లేకుండా చూడాలి
- కేసీఆర్ ఉన్నపుడు ఎప్పుడూ వడ్ల కొనుగోలులో ఇంత ఆలస్యం కాలేదు
- ధాన్యపు రాశుల చుట్టూ తిరగాల్సిన వారు అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అందాల పోటీల్లో బిజీగా ఉన్నాడు.
- ప్రభుత్వం రైతుల నుండి తరుగు పేరిట 3నుంచి 5కేజిల వడ్లు కట్ చేస్తున్నారు
- జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శ్రద్ధ తీసుకొని ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి
- దేశానికి అన్నం పెట్టే రైతు కోసం, ఆరుగాలం కష్టపడే రైతు కష్టం తీర్చడానికి ఈ ముఖ్యమంత్రికి సమయం లేకపోవడం చాలా దురదృష్టకరం.
- ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో రైతులను అరిగోస పెడుతోంది. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నది
- పది రోజులైనా కొన్న పంటకు డబ్బులు దిక్కులేదు
- రైతులకు ఇబ్బంది లేకుండా తక్షణమే ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి



**జయభేరి, డిండి :**

డిండి మండలం టీ.గౌరారం, తవక్లపూర్, డిండి, గొనబోయినపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది అని ఆయన అన్నారు.అప్పులు తెచ్చి పంట పండిస్తే కొనే దిక్కులేక పోయారు అని అన్నారు. లారీల కొరత లేకుండా చూడాలి ఆయన డిమాండ్ చేశారు.అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వానికి రైతుల ధాన్యం కొనగోలుపై లేదు అని ఆయన అన్నారు.గన్ని బ్యాగులు ఇచ్చే పరిస్తితిలో ప్రభుత్వం లేదు అని అన్నారు.కేసీఆర్ ఉన్నపుడు ఎప్పుడూ వడ్ల కొనుగోలులో ఇంత ఆలస్యం కాలేదు అని ఆయన గుర్తు చేశారు.ప్రభుత్వం రైతుల నుండి తరుగు పేరిట 3 కేజిల వడ్లు కట్ చేస్తున్నారు అని వెంటనే ఆపాలని కోరారు.జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శ్రద్ధ తీసుకొని ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుంది అని అన్నారు.పాలన చేతకాకుంటే రేవంత్ రెడ్డి దిగిపోవాలి అని కోరారు. మంత్రులు గాలిమోటర్ల ప్రయాణాలు తప్ప ఏం లేదు అని ఆయన అన్నారు. ఎన్నికల ముందు కేసీఆర్ గారు 10,000 ఇస్తున్నాడు.కాంగ్రెస్ వాళ్లు 15,000 ఇస్తాం. అది కూడా పంట సీజన్ ప్రారంభం కంటే ముందే ఇస్తామన్నారు కానీ ఇప్పుడేమో ఓడ దాటాక బోడ మల్లన్న అన్న విధంగా వ్యవహరిస్తున్నారు అని ఆయన తెలిపారు. పంట పెట్టుబడి సాయం రైతులకు అందించడంలో జాప్యం.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి తక్షణమే కాంటా వేయడంలో జాప్యం.కొన్న ధాన్యాన్ని తరలించడంలో జాప్యం.ధాన్యం అమ్మిన తర్వాత రైతుల ఖాతాల్లో డబ్బులు వేయడంలో జాప్యం,గన్నీ బ్యాగులను సమకూర్చడంలో వైఫల్యం ,ధాన్యాన్ని లారీలకు ఎక్కించే హమాలీలను సమకూర్చడంలో వైఫల్యం,కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో వైఫల్యం.గొప్పగా చెప్పిన బోనస్ అందజేయడంలో ఘోర వైఫల్యం చెందింది అని ఆయన అన్నారు.తక్షణమే ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని అని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర్ రావు,PACS ఛైర్మన్ మాధవరం శ్రీనివాస్ రావు, మాజీ ఎంపీపీ సలహాదారుడు మాధవరం జనార్ధన్ రావు,PACS వైస్ ఛైర్మన్ శిమర్ల మల్లయ్య, గొడుగు వెంకటయ్య, రాఘవా చారి,పెద్దులు, గెలమోని శ్రీను, రమావత్ వెంట్రామ్, రవీందర్ రావు,తండు చంద్రయ్య,బొడ్డు పల్లి జయంత్, కృష్ణయ్య, తిరుపతయ్య ,తాండు శ్రీను ,వెంగల్ రావు, గదర్ శ్రీను,గుర్రం సురేష్ నేత,రషీద్, నార్య నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# పేదల గుడిసెలు కూల్చేస్తారా..

**జయభేరి, హైదరాబాద్, మే 14:**




మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ వరంగల్, ములుగు జిల్లాల పర్యటనకు రానున్నారని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ప్రజాగ్రహానికి గురి చేస్తున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుల్డోజర్ కంపెనీలతో రహస్య ఒప్పందం ఉందా? అని రాహుల్ గాంధీని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. రోజువారీ కూలి పనులు చేసుకుని జీవించే నిరుపేద ప్రజల ఇండ్లతో పాటు వారి జీవనోపాధిని నాశనం చేయడానికి నిరంతర ప్రయత్నం చేయడానికి కారణం ఏంటి ? వరంగల్‌లో కూల్చివేతలు ఎందుకు జరుగుతున్నాయని రాహుల్‌ను కేటీఆర్ ప్రశ్నించారు. ఈరోజు మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించే మార్గాన్ని 'అందం'గా చేయడానికి అని ప్రజలకు చెబుతున్నారు. అలాంటి చర్యలు చేస్తున్న మీ కాంగ్రెస్ నేతలు మీది ప్రజా పాలన అని, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడానికి సిగ్గుపడాలంటూ ఘాటుగా స్పందించారు. రాజభవనాలలో విలాసవంతమైన విందులు, మరోవైపు 200 కోట్ల రూపాయలకు పైగా ప్రజా ధనాన్ని వృథా ఖర్చు చేశారు. బుల్డోజర్లతో పేదల ఇండ్లు కూల్చివేస్తున్నారు. పేదల జీవితాలను బుల్డోజర్ల కింద ఎందుకు నలిపేయాల్సి వచ్చింది?. మీ సిగ్గులేని కాంగ్రెస్ ప్రభుత్వం మేం అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేటీఆర్ షేర్ చేసిన వీడియోలో ఏముందంటే.. రోడ్డు పక్కన ఉన్న పేదల గుడిసెలు, వారి చిన్న చిన్న షాపులను సిబ్బంది తొలగిస్తున్నారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ లో పాల్గొనే అందెగత్తెలు నేడు వరంగల్ జిల్లాకు రానున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వెయ్యి స్తంభాల గుడి, రామప్ప టెంపుల్ లాంటి ప్రముఖ కట్టడాలను వారు సందర్శించనున్నారు. దాంతో తమ లాంటి పేదలకు నష్టం కలిగించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. వారెవరో విదేశాల నుంచి అందగత్తెలు వస్తే మాకు అన్యాయం ఎందుకు చేస్తున్నారు. మా పొట్ట ఎందుకు కొడుతున్నారు. కాంగ్రెస్ కు ఓట్లు వేసింది మేమా, లేక మిస్ వరల్డ్ అందెగత్తెలు వచ్చి ఓట్లు వేశారా అని కొందరు పేదలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.






## ఏజెన్సీలో అడ్డగోలు దందా...

- ఎక్కడపడితే అక్కడ ...
- తాగినోడుకి తాగినంత...
- కిరాణా షాపుల్లోనూ కావాల్సిన బ్రాండ్లు...
- ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు...
- చోద్యం చూస్తున్న అధికారులు...
- బెల్టు షాపులను అరికట్టండి...
- నిబంధనలు పాటించని దుకాణాలను నియంత్రించండి.
- సామాజిక సేవకులు కర్నే బాబురావు

**జయభేరి, భద్రాద్రి కొత్తగూడెం:**

ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గం లోమద్యం మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని, లక్షల్లో మద్యాన్ని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు అక్రమంగా కోట్ల రూపాయలకుపడగలెత్తేందుకు మాఫియాకు తెరలేపారని, ఎమ్మార్పీ కంటే అధిక ధరలతో అడ్డగోలుగా దందా చేస్తున్నారని, సామాజిక సేవకులు కర్నే బాబురావు ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో మద్యం షాపుల వ్యాపారులు సిండికేట్ తో విచ్చలవిడి అమ్మకాలకు తెర లేపారన్నారు. అధికారుల కనుసన్నల్లోనే 24 గంటల పాటు బెల్ట్ షాపులలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. ఓవైపు ప్రభుత్వ వైన్ షాపులలో మరో వైపు బెల్ట్ షాపులలో అధిక రేట్లకు మద్యం విక్రయాలు జరుగుతున్నా, ఎక్సైజు, స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు చేపట్టక పోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అధిక ధరలపై మద్యం ఆగడాలపై ఫిర్యాదు చేసేందుకు ఎవరైనా ఎక్సైజ్ కార్యాలయానికి వెళితే మాత్రం అక్కడ అధికారులు అందుబాటులో ఉండరని, కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగి ఎవరైనా మద్యం ఆగడాలపై ప్రశ్నిస్తే.. 'నిజమా? మా దృష్టికి రాలేదే'.? అంటూ... అమాయకపు చూపులు చూడటం అధికారులకు పరిపాటిగా మారిందన్నారు. మండల కేంద్రంలో ఎక్కడపడితే అక్కడ తాగినోడుకి తాగినంత... మందు మస్తుగా దొరుకుతున్నదని, ఏ ఊర్లె చూసినా, ఏ సందులో చూసినా బెల్టు షాపులు పుట్టగొడుగులెక్క వెలుస్తున్నాయన్నారు. పగలు రాత్రి తేడా లేకుండా వాటిలో మద్యం బహిరంగంగా విక్రయిస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడ చూసిన వైన్ షాప్ టు వయా బెల్టు షాప్ ల అక్రమ రవాణా ఆర్టీసీ కార్గో రవాణాను తలపిస్తుందన్నారు. ఏజెన్సీలో అధిక ధరలతో అక్రమ దందా, మూడు పువ్వులు ఆరు కాయలుగా తేజరిల్లుతోందన్నారు. ఈ విషయంలో సంబంధిత ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతోందన్నారు. పట్టపగలే బెల్టు షాపులకు మద్యం తరలివెళ్తున్న, తెలిపినప్పటికీ, మద్యం అక్రమ విక్రయాల పట్ల ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టవు అన్నట్టు గాఢ నిద్రలో మునిగి పోయారని విమర్శించారు. మరోవైపు బెల్ట్ షాపుల వల్ల మద్యపానం వినియోగం పెరగడమే కాకుండా నియంత్రణ లేని మద్యం అమ్మకాలతో అనేకమంది అప్పుల పాలవుతున్నారని, మహిళలు వేధింపులకు గురవుతారని,అల్లరి మూకలు పెట్రేగి పోతాన్నారని అందువల్ల బెల్ట్ షాపులను ఎక్కడకక్కడ కట్టడి చేయాలన్నారు. ప్రజల ఫిర్యాదులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి వీటిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మద్యం అక్రమ దందాను నియంత్రించి, నిబంధనలను పాటించని వైన్ దుకాణాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ఉప్పల్ లో విషాద సంఘటన..
# ఇద్దరు మైనర్ బాలురు మిస్

- పిల్లర్ గుంతలో ఓ బాలుడి మృత దేహం లభ్యం

**జయభేరి, ఉప్పల్ :**



సిటీలోని ఉప్పల్ లో విషాద సంఘటన చోటుచేసుకుంది. నిన్న(మంగళవారం) ఉప్పల్ పరిధిలోని భాగాయత్‌లో ఇద్దరు మైనర్ బాలురు మిస్ అయ్యారు. అయితే, బుధవారం మిస్ అయిన ఇద్దరిలో ఓ బాలుడు పిల్లర్ గుంతలో పడి మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. పిల్లర్ గుంతో బాలుడి మృతదేహం గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు బాలుడి మృతదేహాన్ని బయటకు తీసి పోస్ట్ మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.వివరాల్లోకి వెళితే.. ఉప్పల్ భాగాయత్ ప్రాంతంలో జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన సుజాత, వెంకటేష్ దంపతులు తమ ఇద్దరు కుమారులు అర్జున్ (8), మణికంఠ(15), ఒక కూతురుతో కలిసి నివాసం ఉంటున్నారు. నిన్న ఇద్దరు కుమారులు కనిపించకుండా పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలోనే భాగాయత్‌లో కుల సంఘాల భవన నిర్మాణం కోసం తీసిన పిల్లర్ గుంతలో బుధవారం అర్జున్ మృతదేహం లభ్యమైంది. దీంతో మరో కుమారుడు మణికంఠ కొరకు ఉప్పల్ పోలీసులు, డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఈత కోసం వెళ్లారా? లేదా ఎవరైన చంపి పిల్లర్ గుంతలో పడేశా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ‘కింగ్‌డమ్’ కాస్త ఆలస్యం

**జూలై 4న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటన**

అగ్ర హీరో విజయ్ దేవరకొండ తాజా చిత్రం ‘కింగ్‌డమ్’ విడుదల వాయిదా పడింది. ఈ సినిమాను జూలై 4న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ముందస్తు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 30న సినిమా విడుదల కావాల్సి ఉంది. ఇటీవల దేశంలో చోటుచేసుకున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం కష్టమని భావించి ముందుగా అనుకున్న రోజున రిలీజ్ చేయలేకపోతున్నామని చిత్ర బృందం పేర్కొంది. ‘వాయిదా నిర్ణయం సినిమాకు మరిన్ని మెరుగులుదిద్ది, మరింత ఉన్నతీకరించడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నాం. కాస్త ఆలస్యమైనా సరే అభిమానుల అంచనాల్ని అందుకొని ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకం ఉంది’ అని మేకర్స్ ఓ ప్రకటనలో తెలిపారు. పీరియాడిక్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. ‘వలసపోయినా.. అలసిపోయినా ఆగిపోనిది ఈ మహారణం, ఈ అలజడి ఎవరి కోసం? ఇంత భీభత్సం ఎవరి కోసం?...రణభూమిని చీల్చుకొని పుట్టే కొత్త రాజు కోసం, కాలచక్రాన్ని బద్దలుకొట్టి పునర్జన్మనెత్తిన నాయకుడి కోసం’ అంటూ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌తో విడుదల చేసిన ఈ చిత్ర టీజర్ అభిమానుల అంచనాల్ని రెట్టింపు చేసింది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, నిర్మాణ సంస్థ: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య, రచనదర్శకత్వం: గౌతమ్ తిన్ననూరి.

# భాగ్యనగరిలో ‘ఓజీ’ యాక్షన్



రాజకీయాలకు కాస్త బ్రేక్‌నిచ్చి ఇక వరుసగా తన సినిమాలను పూర్తి చేసే పనిలో పడ్డారు అగ్ర హీరో పవన్‌కల్యాణ్. ఇటీవలే ఆయన ‘ఓజీ’ షూటింగ్‌లో జాయిన్ అయిన విషయం తెలిసిందే. ‘మళ్లీ మొదలైంది.. ఈసారి ముగిద్దాం’ అంటూ చిత్ర బృందం సోషల్‌మీడియాలో చేసిన పోస్ట్‌తో అభిమానులు ఖుషీ అయ్యారు. సుజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా ఇది.

ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నది. పవన్‌కల్యాణ్ ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌లో పాల్గొంటున్నారని, ఇది సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని చిత్రబృందం చెబుతున్నది. సాధ్యమైనంత తొందరలో ఈ సినిమాను పూర్తి చేయాలనే ఆలోచనలో పవన్‌కల్యాణ్ ఉన్నట్లు సమాచారం. ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు.



# ఈ బ్యూటీ డ్రెస్ ధర తెలిస్తే..

పాన్ ఇండియన్ బ్యూటీ ఊర్వశి రౌతేలా నిత్యం ఏదోక కారణంతో నిత్యం వార్తాలలో నిలుస్తూనే ఉంటుంది. సినిమాలతో కాకుండా ఆమె నిత్యం ఏదోక కామెంట్స్ చేస్తూ విమర్శల పాలవుతుంది. ఇప్పుడు ఈ బ్యూటీకి అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చుకుంది. ఈ క్రమంలోనే ఊర్వశి రౌతేలా కేన్స్ (కేన్స్ 2025) ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొంది. రంగు రంగుల డ్రెస్ ధరించి రెడ్ కార్పెట్ పై సందడి చేసింది. అయితే ఇందులో ఊర్వశి లుక్స్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు ఆమె డ్రెస్ ధర తెలిసి షాకవుతున్నారు నెటిజన్స్. ఆమె ధరించిన డ్రెస్ ధరతో ఏకంగా నాలుగు లగ్జరీ విల్లాస్ కొనొచ్చు. ఇంతకీ ఆ గౌను ధర ఎంతో తెలుసా.. ? నివేదికల ప్రకారం, కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ మొదటి రోజున ఊర్వశి రౌతేలా రెడ్ కార్పెట్ మీద ధరించిన గౌను ధర రూ. 40.41 కోట్లు! దీన్ని చాలా ప్రత్యేకంగా తయారు చేసినట్లు సమాచారం. ఈ రంగురంగుల గౌనులో ఊర్వశి రౌతేలా మెరిసిపోయింది. ఆమె ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఊర్వశి రౌతేలా ఫ్యాషన్ ప్రపంచంలో ఎప్పుడూ వెలుగుతూనే ఉంటుంది. ఊర్వశికి సంబంధించిన ఫోటోస్, వీడియోస్ నిత్యం నెట్టింట హల్చల్ అవుతుంటాయి. సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ మాత్రమే కాకుండా ప్రతిష్టాత్మక బ్రాండ్స్ కు ఆమె బ్రాండ్ అంబాసిడర్. కొంతమంది ఊర్వశి రౌతేలా దుస్తుల ధరపై ఆమెను ట్రోల్ చేశారు. రూ. 40 కోట్లు అయినప్పటికీ చూసేందుకు ఆకర్షణీయంగా లేదని.. మితిమీరిన రంగులతో ఉందని.. ఇందుకు రూ. 40 కోట్లు ఎందుకు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇది ఊర్వశి రౌతేలా ఫస్ట్ లుక్. వారం రోజుల పాటు జరిగే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆమె తదుపరి డ్రెస్ ఎలా ఉంటుందో చూడటానికి అభిమానులు ఎదురుచూస్తున్నారు.



# అదృష్టం పలకరించింది!

‘రెట్రో’ సినిమా సక్సెస్‌తో మంగళూరు సోయగం పూజా హెగ్డే పట్టరాని సంతోషంతో ఉంది. ఈ భామకు గత రెండేళ్లుగా ఒక్క సక్సెస్ రాలేదు. అగ్ర హీరోలతో నటించిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద ఫ్లాపయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ భామ కెరీరే ప్రశ్నార్థకంగా మారింది. అయితే సూర్య సరసన నటించిన ‘రెట్రో’ చిత్రం ఈ భామ కెరీర్‌కు కొత్త ఊపిరిలూదింది. ఈ సినిమాలో డీగ్లామర్ పాత్రలో పూజా హెగ్డే అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. చాలా విరామం తర్వాత ఆమె నటిగా సత్తాచాటిందని, ఇకపై ఇలాంటి రోల్స్ ఎంచుకోవాలని సోషల్‌మీడియాలో అభిమానులు అభిప్రాయపడ్డారు.

‘రెట్రో’ సక్సెస్‌తో తన కెరీర్‌కు మంచి రోజులొచ్చాయని, ఇకపై కథాంశాల ఎంపికలో మరింత జాగ్రత్తగా ఉంటానని, గ్లామర్ రోల్స్‌తో పాటు పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ చిత్రాలను ఎంపిక చేసుకుంటానని అభిమానులకు భరోసానిస్తున్నది పూజాహెగ్డే. తమిళంలో తాను విజయ్‌తో చేస్తున్న ‘జన నాయగన్’, లారెన్స్‌తో నటిస్తున్న ‘కాంచన4’ చిత్రాలు తప్పకుండా భారీ హిట్స్‌గా నిలుస్తాయనే ధీమాతో ఉందట పూజాహెగ్డే. మొత్తానికి ‘రెట్రో’ విజయంతో పూజాహెగ్డే మళ్లీ సక్సెస్‌ట్రాక్‌లోకి వచ్చిందని అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# తెలుగులో ‘కేసరి ఛాప్టర్2’



అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా నటించిన హిస్టారికల్ కోర్ట్‌రూమ్ డ్రామా ‘కేసరి ఛాప్టర్2’ ’ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ జలియన్‌వాలా బాగ్’ విజయవంతంగా ప్రదర్శింపబడుతూ మంచి వసూళ్లను సాధిస్తున్నది. తాజాగా ఈ సినిమా తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ను ఈ నెల 23న విడుదల చేయబోతున్నారు. సురేష్‌ప్రొడక్షన్స్ సంస్థ భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నది.

కరణ్‌సింగ్ త్యాగీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఆర్.మాధవన్, అనన్యపాండే ముఖ్య పాత్రల్ని పోషించారు. ‘ది కేస్ దట్ షుక్ ది ఎంపైర్’ అనే పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. జలియన్‌వాలాబాగ్ మారణహోమాన్ని కోర్టులో సవాలు చేసి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన న్యాయవాది సి.శంకరన్ నాయర్ జీవిత కథ స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. హిందీలో ధర్మా ప్రొడక్షన్స్, లియో మీడియా కలెక్టివ్, కేఫ్ ఆఫ్ గుడ్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మించాయి.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com